


హోటల్‌కు వెళ్లి మనకు కావాల్సిన ఆహారం కోసం ఆర్డర్ ఇస్తాం. దానికే బిల్లు చెల్లిస్తాం. ఇది వ్యక్తికి ఉన్న స్వేచ్ఛ.. సాధారణంగా జరిగేది ఇదే. అయితే.. ఎరువుల కంపెనీలు మాత్రం ఈ సహజ ప్రక్రియకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. యూరియా కావాలంటే దానితోపాటు కంపెనీ సూచించిన గ్రోత్ గ్యానుల్స్, సిటీ కంపోస్ట్, పీడీఎం పొటాష్.. వంటి ఏదో మరో ఎరువు కొనాల్సిందే అని డీలర్లకు షరతులు పెడుతున్నారు. రైతులకు ఇష్టం లేకపోయినా యూరియాతో పాటు ఇతర ఎరువులు అదనంగా అంటగడుతున్నారు. కంపెనీలు, డీలర్ల మధ్య అంతిమంగా నష్టపోయేది మట్టిలో స్వేదం చిందించే కష్టజీవులే. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



- ఎరువుల డీలర్లపై కంపెనీల ఒత్తిడి
- అంతిమంగా నష్టపోతున్నది రైతులే
- మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేస్తే డీలర్ల దోపిడీకి కళ్లెం
- ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతులకు అవస్థలు

యూరియాతో మరో ఎరువు లింక్

కర్నూలు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. కర్నూలు జిల్లాలో తెల్ల బంగారం పత్తి, ఉల్లి, మిరప అధికంగా సాగు చేస్తే.. నంద్యాల జిల్లాలో వరి, మొక్కజొన్న పంటలు ప్రధానంగా సాగు చేస్తున్నారు. 2025-26 ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో 4,22,540 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 2,06,448 హెక్టార్లు కలిపి 6,28,988 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పైర్లు ఏపుగా పెరిగి మంచి దిగుబడులు రావాలంటే ఎరువులు ఎంతో కీలకం. కర్నూలు జిల్లాకు 2,46,502 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 3,17,464 మెట్రిక్ టన్నులు రసాయన ఎరువులు అవసరమని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం రెండు జిల్లాల్లో సుమారుగా 78 వేలు మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉందని అధికారులే అంటున్నారు. అంటే.. 3.95 నుంచి 4 లక్షల మెట్రిక్ టన్నులు ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం నెలల వారిగా ఆయా కంపెనీలు సరఫరా చేయాల్సి ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ముందస్తు వర్షాలు రావడంతో అప్పుడే అన్నదాతలు దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు పొలాలు సిద్ధం చేశారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి విత్తనాలు, అవసరమైన ఎరువులు కోనుగోలు కోసం డీలర్ల వద్దకు రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు.



కంపెనీల లింక్ దోపిడీ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో లైసెన్స్‌గల రసాయన ఎరువుల డీలర్లు 3,500 మందికి పైగా ఉన్నారు. కర్నూలు జిల్లాతో పోలిస్తే నంద్యాల జిల్లాలో సాగు విస్తీర్ణం తక్కువగా ఉన్నా.. కేసీ కాలువ, తెలుగుగంగ ప్రాజెక్టులు, ఎస్సార్బీసీ కాలువలు పరిధిలో అత్యధికంగా వరి సాగు చేస్తుండంతో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 5.64 లక్షల మెట్రిక్ టన్నులు వివిధ రకాల రసాయన ఎరువులు అవసరం ఉంది. అందులో యూరియా ఒక్కటే 1.59 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా. అంటే.. మొత్తం ఎరువుల్లో యూరియా వినియోగం 28-30 శాతం ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఏటేటా యూరియా వాడకం పెరుగుతుందని అంటున్నారు. ఇదే అదనుగా కంపెనీలే 'లింక్' దోపిడీకి తెర తీశాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. యూరియా అందుబాటులో ఉన్నా కృత్రిమ కొరత సృష్టిస్తూ కంపెనీలు రైతులకు అవసరం లేని గ్రోత్ గ్యానుల్, పీడీఎం పొటాష్, సిటీ కంపోస్ట్, ఎస్ఎస్‌డీ.. వంటి వివిధ రకాల ఎరువులు బలవంతంగా అంటగడుతున్నారు. వీటిని తీసుకుంటేనే యూరియా ఇస్తామంటూ కంపెనీలు, వాటి సేల్స్‌మేనేజర్లు డీలర్లపై ఒత్తిడితెస్తున్నారు.45కిలోల యూరియా బస్తా రూ.266కు విక్రయిస్తున్నారు. రూ.59,100 విలువచేసే పదిటన్నులు యూరియా (222 బస్తాలు) కావాలంటే.. రూ.25-30వేలు విలువచేసే రైతులకు ఏ మాత్రం ఇష్టంలేని ఎరువులు తీసుకోవాల్సిందే అంటూ కంపెనీలు ఒత్తిడి తెస్తున్నాయి. లేదంటే డీలర్లకు అవసరమైన డీఏపీ, 28:28:0.. వంటి కాంప్లెక్స్ ఎరువులు ఇవ్వలేమని కంపెనీలే తేల్చి చెప్పేస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు. దీంతో ఇష్టం లేకపోయినా కంపెనీలు అంటగట్టిన ఇతర ఎరువులు తీసుకొని.. వాటిని యూరియాతో లింక్ పెట్టి రైతులను మభ్యపెడుతూ యూరియాతో పాటు ఫలాన ఎరువులు, పురుగుమందులు వాడితే ప్రయోజనం ఉంటుందని బలవంతంగా అంటగడుతున్నారు. అవసరం లేకున్నా వాటినికొని రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. వాస్తవంగా యూరియాకు ఇతర ఎరువులు లింక్ పెట్టి విక్రయించకూడదన్న ఉత్తర్వులు ఉన్నా.. ఆచరణలో అమలు కావడం లేదు.

మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరానే పరిష్కారం

రసాయనాల ఎరువుల అంశం కేంద్రం పరిధిలోకి వస్తుంది. అయితే.. రాష్ట్రాలు తమకు ఏ ఏ ఎరువులు అవసరమో కేంద్రానికి నివేదిక ఇస్తే సమీక్షించి ఏడాదికి సరిపడా ఎరువులను కేటాయిస్తుంది. ఏ నెలకు ఎంత పరిమాణంలో ఏ ఎరువు అవసరమో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు ప్రణాళికలు తయారు చేస్తారు. ఆ మేరకు జిల్లాలు, మండలాలకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తుంది. రాష్ట్రానికి కేటాయించిన యూరియా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే ఆధీనంలోకి తీసుకొని.. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 50 శాతం వ్యవసాయ సహకార సంఘాలు ద్వారా, మరో 50 శాతం డీలర్ల ద్వారా యూరియా సరఫరా చేయాలి. అప్పుడు డీలర్లు కంపెనీల నుంచి యూరియా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. అదే జరిగితే ఎరువుల కంపెనీలు రైతులకు అవసరం లేని ఎరువులు కొనుగోలు చేయాలంటూ డీలర్లపై ఒత్తిడి తీసుకురాలేదు. ద్వారా రైతులకు అవసరమైన మేరకు ఎమ్మార్పీ ధరకే యూరియా అందుబాటులోకి వస్తుంది. అవసరం లేని ఎరువులు అంటగట్టకపోతే రైతులకు ఆర్థికంగా ఆదా అవుతుంది. ఆ దిశగా వ్యవసాయ అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లింక్ ఎరువులు అమ్మరాదు

యూరియాను ఇతర ఎరువులకు లింక్ పెట్టి విక్రయించరాదని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. డీలర్లు ఇలా విక్రయించినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మినా చర్యలు తీసుకుంటాం. డీలర్లపై ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకుకెళ్తాం. ● వరలక్ష్మి, జేడీ, వ్యవసాయ శాఖ, కర్నూలు

కంపెనీలే లింక్ పెడుతున్నాయి

యూరియాతో పాటు వేరే ఎరువులు కొనాల్సిందే అని కంపెనీలే ఒత్తిడి తెస్తున్నాయి. రూ.50వేలు విలువైన యూరియా ఇవ్వాలంటే రూ.25-30 వేలు విలువైన ఇతర ఎరువులు లింక్ పెడుతున్నాయి. ● అశోకానందారెడ్డి, ఏపీ ఎరువులు, పురుగు మందుల విక్రయ డీలర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆదోని

ఉమ్మడి జిల్లాలో ఎరువుల విక్రయాలు, టన్నుల్లో

ఎరువులు	కర్నూలు	నంద్యాల
డీఏపీ	21,230.3	42,413.5
ఎంఓపీ	2,074.65	6,317.9
14:35:0	20,403.6	11,729.85
20:20:0:3	82,351.85	1,03,442.9
24:24:0	3,285.7	2,391
28:28:0	28,030.7	23,035.65
ఎన్‌పీకే	19,726.15	19,692.2
యూరియా	62,884.67	96,183.91
ఇరత ఎరువులు	6,514.85	12,257.1
మొత్తం	2,46,502.5	3,17,464

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 ఫోన్ చేయవచ్చు

అధికారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ అన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారీ అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

- సాధారణ దర్శనానికి నాలుగు గంటల సమయం
- మూల బృందావనానికి ప్రత్యేక పూజలు
- ప్రత్యేక క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం

మంత్రాలయం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయానికి భక్తులు పోటెత్తారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థం లక్షల్లో భక్తులు తరలివచ్చారు. వరుస సెలవు దినాలు కావడంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరాగా రద్దీ నెలకొంది. భక్తులతో అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వ మార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం సందడిగా మారింది. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేకలు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, పోలీసులు, సెక్యూరిటీ ఆధ్వర్యంలో శ్రీమఠం ప్రాంగణంలో క్యూలైన్లు అదనంగా ఏర్పాటుచేశారు. ప్రసాదాల కొరత రాకుండా మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, ప్రత్యేకకౌంటర్లు ఏర్పాటుచేశారు. భక్తులు పోటెత్తడంతో సాధారణ దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. దర్శనం చేసుకున్న భక్తులను బయటకు పంపిస్తూ ఎప్పటికప్పుడు మేనేజరు ఎస్‌కే శ్రీనివాసరావు జాగ్రత్తలు తీసుకున్నారు. దర్శనం చేసుకున్న భక్తులను ప్రాకారం నుంచి బయటికి వెళ్లాలని సిబ్బంది మైకులతో సూచించారు.



ఏపీఈఏపీ సెట్ ఫలితాలు విడుదల



హేమ సాగరిక
137/160



ఆర్.గోవర్ధన్ చౌదరి
131.226/160



కె.చరణ్ కుమార్
118.81 / 160



మిథున్ సాయి కుమార్
118.13 /160

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం సాయంత్రం విడుదలయ్యాయి. ఈ పరీక్షలు మే 19 నుంచి 28వ తేదీ వరకు కొనసాగాయి. కర్నూలు జిల్లాలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసి కోర్సుల కోసం 18,892 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో పరీక్షకు 17,827 మంది హాజరు కాగా, 13,708 మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 12,522 మంది దరఖాస్తు చేసుకున్నారు. 11,855 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా, ఇందులో 8403 మంది అర్హత సాధించారు. అలాగే అగ్రికల్చర్, ఫార్మసి విభాగాల్లో 6370 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్ పరీక్షకు 5972 మంది హాజరు కాగా, ఇందులో 5305 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్ ఫార్మసి విభాగాల్లో కర్నూలు చెందిన హేమసాగరిక 137/160 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంకును, కర్నూలు సంతోష్ నగర్‌కు చెందిన ఆర్. గోవర్ధన్ చౌదరి 131.226 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 65వ ర్యాంకు సాధించారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో కె.చరణ్ కుమార్ 118.81/160 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 220వ ర్యాంకును, మిథున్ సాయికుమార్ 118.13 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 232వ ర్యాంకును సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. వీటితో పాటు జిల్లాలో అనేక మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు, మార్కులు సాధించి అత్యంత ప్రతిభను కనబరిచారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య 7

నేడు మహానందికి దేవదాయశాఖ మంత్రి రాక
నూతన వసతి గృహాల నిర్మాణానికి భూమి పూజ

ఉపాధి కూలీలకు భరోసా..



- ప్రమాద బీమా రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంపు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేసే శ్రామికులకు గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. ప్రమాదవశాత్తు వారు మరణిస్తే కేవలం ప్రమాద బీమా రూ.50 వేలు మాత్రమే చెల్లించే వారు. దీంతో ఆ కుటుంబాలు వీధి పాలయ్యాయి. కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న రైతులు, కూలీలకు ప్రమాద బీమా మొత్తాన్ని రూ.50వేల నుంచి రూ.4 లక్షలకు పెంచడంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల కర్నూలు జిల్లాలో మూడున్నర లక్షల కుటుంబాలు, నంద్యాల జిల్లాలో 2 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందనున్నాయి.

ప్రమాద బీమా పెంపు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న ఉపాధి శ్రామికులకు మేలు చేకూర్చే కార్యక్రమాన్ని ఇటీవల వెల్లడించారు. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 1.70 లక్షల మంది ప్రస్తుతం పనులు చేస్తున్నారు. వీరికి రోజూ వారి వేతనం రూ.307కు పెంచారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల అమరావతిలో నిర్వహించిన ఉపాధి శ్రామికుల ఆత్మీయ కలయికలో భాగంగా బీమా పరిహారంపై ప్రకటన చేశారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించినా, తీవ్ర అంగవైకల్యానికి గురైనా ఆ కుటుంబ సభ్యులకు బీమా వర్తిస్తుంది. ఇది ఇప్పటి వరకు గరిష్ఠంగా రూ.50వేలు మాత్రమే ఉండగా.. ప్రస్తుతం రూ.4లక్షలకు పెంచారు.

ఉపాధి శ్రామికులకు ఎంతో మేలు

కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న శ్రామికులకు, తాత్కాలిక ఉద్యోగులకు ప్రమాద బీమా మొత్తాన్ని పెంచింది. ప్రమాదవశాత్తు మరణించినా, గాయపడినా గతంలో కంటే ప్రస్తుతం ఎక్కువ మొత్తాన్ని పరిహారంగా అందిస్తారు. గతంలో రూ.50వేలు మాత్రమే చెల్లించేవారు. ప్రస్తుతం రూ.4లక్షల దాకా బాధిత కుటుంబ సభ్యులకు అందిస్తారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పేద కుటుంబాల్లో ఈ పథకంపై మరింత శ్రద్ధ పెరిగి ఎక్కువ మంది శ్రామికులు పని కోసం వచ్చే అవకాశం ఉంది.
● వెంకటరమణయ్య, డ్వామా పీడీ

లక్షన్నర మందికి లబ్ధి

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం లక్షన్నర మంది దాకా ఉపాధి పనులు చేస్తున్నారు. వీరంతా సొంత గ్రామాలతో పాటు సమీప గ్రామాలకు పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పని ప్రదేశంలో పాము కాటు, వడదెబ్బ, పిడుగు తదితర కారణాల వల్ల మృతి చెందుతున్నారు. ఇకపై ఇలాంటి వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించనుంది. కేంద్ర ప్రభుత్వం పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవనజ్యోతి బీమా యోజన ద్వారా రూ.2 లక్షలు చెల్లిస్తుండగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పరిహారం మరో రూ.2లక్షలు కలిపి మొత్తం రూ.4 లక్షల పరిహారాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు కూడా ఆసరా కల్పించేలా వారికి ఇస్తున్న బీమా సాయాన్ని పెంచింది. ప్రస్తుతం ఉపాధి పథకంలో ప్రతి మండలంలో సగటున పది మంది వరకు ఉద్యోగులు ఉన్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తున్న నీటి యాజమాన్య సంస్థలో రెగ్యులర్ ఉద్యోగులు ఎవరూ లేరు. చాలా వరకు కాంట్రాక్టు, రిసోర్సు విధానంలో పని చేస్తున్నారు. వీరిలో ఏపీవో, ఈసీ, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ సిబ్బంది, జిల్లా స్థాయిలో పని చేసే ఉద్యోగులు ఉన్నారు. వీరికి ఇప్పటి దాకా ప్రమాద మరణ, వైకల్య బీమా రూ.3 లక్షలుగా ఉంది. వీరిలో నిర్దేశిత కాలపరిమితి ఉద్యోగులకు (ఎఫ్‌టీఈ) ఈ పరిహారం గరిష్ఠంగా రూ.30 లక్షలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం చేసుకోవడంతో పాటు ప్రస్తుతం అమలవుతున్న వేతన ఖాతాల్లో మార్పులు కూడా చేసింది. తద్వారా ఉమ్మడి జిల్లాలో వందలాది మందికి పై ప్రయోజనాలు అందనున్నాయి.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



బి. తాండ్రపాడు చెరువులో ఆకట్టుకుంటున్న గుర్రపు డెక్క పూలు

గుర్రపు డెక్క.. పూసెను ఎంచక్కా..!

కర్నూలు నగర శివారు ఉన్న బి.తాండ్రపాడు చెరువులో గుర్రపు డెక్క పూలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. కర్నూలు-నంద్యాల ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెరువు కడతూము భాగం గుర్రపు డెక్కతో అల్లుకుపోయి.. పూలతో నిండిపోయింది. దూరం నుంచి చూస్తే వంగపూలతో తివాచి పరిచినట్లు అందంగా కనిపిస్తోంది. పచ్చని ఆకుల మధ్య తెలుపు, వంగపూత రంగులతో పూశాయి. గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి ఆటంకమే అయినా, ఇలా పూలు విరగబూసి ఆకర్షిస్తున్నాయి. ఆ రహదారి వెంట వెళ్తున్న వారు అక్కడ ఆగి సెల్ఫీలు, ఫొటోలు తీసుకొని ఆనందిస్తున్నారు.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)



రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని ఆదివారం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జ్యోతి మూలెమణి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద శ్రీమఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి శ్రీపతిఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనస్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈమె వెంట ఎస్ఐ శివాంజిల్, వ్యాసరాజ ఆచార్, జేపీ స్వామి, జయతీర్థ ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహానందికి దేవదాయశాఖ మంత్రి రాక

నూతన వసతి గృహాల నిర్మాణానికి భూమి పూజ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రానికి సోమవారం ఉదయం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. మంత్రి చేతుల మీదుగా క్షేత్ర పరిధిలో దేవదాయశాఖ నిధులతో రూ.10 కోట్లతో నిర్మించే 55 గదుల వసతి గృహాలకు భూమి పూజ చేయించి నిర్మాణానికి శ్రీకారం చుడతామని చెప్పారు. మహానంది పరిసరాల్లో భక్తుల వసతి కోసం తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో రూ.1.60 లక్షలతో నిర్మించిన డార్మెంటరీని కూడా మంత్రి చేత ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న శివాలయం పునఃనిర్మాణ పనుల కోసం రూ.కోటితో చేపట్టనున్న అభివృద్ధి పనులను కూడా మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

తుగ్గలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన మండలంలోని జొన్నగిరిలో జరిగినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన రాంపల్లి సతీష్(25) హైదరాబాద్‌లో ఉంటున్నాడు. తల్లి గోవిందమ్మకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇటీవలే జొన్నగిరికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. తల్లి ఆరోగ్యం కోసం రూ.5లక్షలు అప్పులు చేశారు. వాటిని ఎలా తీర్చాలో అర్థంకాక మనోవేదనకు గురయ్యాడు. ఇంటిపైన రేకుల షెడ్డులో ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు. సతీష్‌కు భార్య భూమిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి పనులకెళ్లి.. మృత్యు ఒడికి

- తిరుపతిలో కూలి పని చేస్తూ యువకుడి దుర్మరణం

మంత్రాలయం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వేరే ప్రాంతానికి వలస వెళ్లి మట్టి పనులు చేస్తూ ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన తిరుపతిలో శనివారం చోటుచేసుకున్నట్లు బంధువులు తెలిపారు. వివరాలు.. మంత్రాలయం మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన చాకలి నాగరాజు(26) ఆరునెలల క్రితం కుటుంబంతో కలిసి కూలీ పనుల కోసం తిరుపతికి వలస వెళ్లాడు. శనివారం అక్కడ మట్టి పనులు చేస్తుండగా పైనున్న మట్టి నాగరాజుపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని శనివారం రాత్రి సొంత గ్రామమైన మాలపల్లికి తీసుకువచ్చారు. పొట్టకూటి కోసం వలస వెళ్లి మృతిచెందడంతో భార్యాపిల్లలు, బంధువులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. నాగరాజుకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. వలస వెళ్లి మృతిచెందిన నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక డిమాండ్



జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళనలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ముట్టడి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఎస్‌జీటీలకు ప్రాధాన్యత క్రమంలో 3,500 ఖాళీలు ఆప్షన్లుగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లాపై పూర్తిగా అవగాహన ఉన్న వారు మాత్రమే ఆప్షన్ ఇచ్చుకోగలరన్నారు. లేకపోతే ఉపాధ్యాయులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. మహిళా సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్‌ఆప్షన్ ఒక్కరోజులో ఇవ్వడం అసాధ్యమని, పొరపాట్లు జరిగితే రెండు సంవత్సరాలపాటు దాని ఫలితం అనుభవించాల్సి వస్తుందన్నారు. ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్లు సేవాలాల్ నాయక్ పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

- ఐదుగురికి గాయాలు
- మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

మంత్రాలయం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా నాయకులు, మాజీ జడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షులు, ఎమ్మిగనూరు కోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కరణం గురు రాజారావు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. ఆదివారం గ్రామానికి చెందిన చాకలి నాగరాజు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సమయంలో ఇరువర్గాలు ఎదురెదురు పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ఐదుమందికి గాయాలయ్యాయి. వైసీపీకి చెందిన గురురాజారావు తలకు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, రాజు, రంగస్వామికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్ గ్రామానికి చేరుకుని శాంతిభద్రతలను అదుపు చేశారు. ఇరువర్గాలు అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. పొలం తగాదాలే ఈ ఘర్షణకు కారణమని తెలుస్తోంది. వైసీపీ నాయకులను ఎమ్మిగనూరు ఆసుపత్రికి, టీడీపీ నాయకులను ఆదోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను విచారించి కేసు నమోదు చేస్తామని మంత్రాలయం సీఐ, మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. మాలపల్లిలో టీడీపీ, వైసీపీ మధ్య ఘర్షణ జరగడంతో అటూ టీడీపీ, ఇటు వైసీపీ నాయకులు అప్రమత్తమయ్యారు.

మహానందిలో భక్తుల రద్దీ

రుద్రగుండం కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు



దర్శనం కోసం క్యూలో భక్తులు



రుద్రగుండం కోనేరులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం ఆదివారం వేలాది మంది భక్తుల రద్దీతో పోటెత్తింది. వరుసగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులతో పాటు చిన్నారులకు వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని కుటుంబ సమేతంగా మహానందీశ్వరుని దర్శనం కోసం తరలి వచ్చారు. దేవస్థానానికి చెందిన అరకొర వసతి గృహాలు శనివారం సాయంత్రమే నిండిపోవడంతో సమీపంలోని ప్రైవేట్ వసతి గృహాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వేకువజాముననే ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతోపాటు రెండో ప్రాకారంలోని పూల కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి దర్శనం కోసం ఓపికతో క్యూలో నిలబడ్డారు. క్షేత్ర పరిసరాల్లో ఆదివారం రాత్రి వరకు భక్తుల రద్దీ కనిపించింది.

వైసీపీ నాయకుడి బెదిరింపు

కొలిమిగుండ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించమంటే అంతు చూస్తానని .. వైసీపీ నేత, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సోద రుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డి బెదిరించినట్లు చర్చ జరుగు తోంది. వైసీపీ నేత, కొలిమిగుండ్ల మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన చెక్కా వెంకటరాముడు రామ్‌కో సిమెం ట్ పరిశ్రమలో ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డి కాంట్రాక్టు పనులకు టిప్పర్లు బాడుగకు పెట్టాడు. 25-05-2023 నుంచి సుమారు 6 నెలల పా టు టిప్పర్ల బాడుగగా ఆయన రూ.17.46 లక్షలు ఇవ్వాల్సి ఉంది. ఆ సొమ్ము ఇవ్వాలని పలుమార్లు కోరినా ఉదయభాస్కరరెడ్డి సరైన సమా ధానం ఇవ్వకపోగా, చెక్కా వెంకటరాముడిని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

ఆస్తి కోసం దారుణ హత్య

చాగలమర్రి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శెట్టివీడు గ్రామంలో ఆదివారం రాత్రి కట్టుబడి మదార్‌సా (75) దారుణ హత్యకు గురయ్యారు. మదార్‌సా గ్రామంలోని మసీదులో మౌజన్‌గా పని చేస్తుండేవారు. తన కున్న ఎకరా పొలంలో వ్యవసాయం చేసుకుం టూ భార్య మహబూబ్బీతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మసీదు లోనే ఐదు పూటలా నమాజు చేసుకుంటూ, మౌజన్‌గా పని చేస్తున్నారు. మదార్‌సాతో ఆయన తమ్ముడి మనవుడు హుస్సేన్‌సా ఆస్తి కోసం ఘర్షణ పడ్డాడు మదార్‌సాను మరుగుదొడ్డిలోకి తీసుకెళ్లి హత్య చేసి తాళం వేశాడు. మసీదు లోపలికి వెళ్లిన ఓ వ్యక్తి మరుగుదొడ్డి వద్దకు వెళ్లి చూడగా తాళం వేసి ఉండటంతో అనుమానం వచ్చి చూడగా మదర్‌సా హత్యకు గురై ఉండటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారించారు. హత్యకు గురైన మదార్‌సా మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ సురేష్ మృతదేహాన్ని పరిశీలించి జరిగిన ఘటనపై కుటుంబ సభ్యులతో విచారణ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశైల దేవస్థానానికి వాహనాల అందజేత



దేవస్థానం అధికారులకు వాహనాల పత్రాలను అందజేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

నంద్యాల కల్చరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానానికి కెనరాబ్యాంకు తరపున రెండు బొలెరో వాహనాలను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావుకు కెనరా బ్యాంకు కర్నూలు ప్రాంతీయ కార్యాలయ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుశాంత్ కుమార్ వాహనాలకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ రెండు వాహనాల విలువ సుమారు రూ.21.56లక్షలకు పైగా ఉంటుందని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగేశ్వరరావు, కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ వెంకటేష్, స్థానిక బ్యాంకు మేనేజర్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం



ఆర్డీవో సందీప్‌కుమార్





యోగాసనాలు వేస్తున్న ప్రజలు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): 2047 సంవత్సరం నాటికి ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ అన్నారు. ఆదివారం యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న రూపాల సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్డీవో ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకుల ఆధ్వర్యంలో యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో కూడా ఇదే స్ఫూర్తితో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ సుధాకర్‌రెడ్డి, సైనిక్ వెల్ఫేర్ అధికారి, కర్నూలు తహసీల్దార్ రమేష్, దిన్నెదేవరపాడు సర్పంచ్ మాధవస్వామి, తాండ్రపాడు సర్పంచ్ జయన్న, టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, యోగా అసోసియేషన్ కార్యదర్శి అవినాష్ శెట్టి, యోగా శిక్షకులు, ప్రజలు పాల్గొన్నారు.

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగదు

- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని 'కుడా' చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంటనే భారతీరెడ్డి, కొమ్మినేని, కృష్ణంరాజు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ న్యూస్ పేపర్, ఓ న్యూస్ చానల్‌లో తప్పుడు .. రోత రాతలు రాయడం దుర్మార్గమని అన్నారు. అమరావతి నిర్మాణం కోసం వేలాది ఎకరాల భూములను త్యాగం చేసిన రైతుల పట్ల ఇలాంటి వారిని ఏం చేయాలో ప్రజలే చెప్పాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నాగన్న (ఫైల్)

తుగ్గలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం కర్నూలు జిల్లాలో జరిగింది. తుగ్గలి మండలంలోని గుడిసె గువ్వలకు చెందిన నాగన్న (58) తనకున్న 4.67 ఎకరాల పొలంతో పాటు దాదాపు 10 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ, కంది, ఆముదం, పత్తి సాగుచేసేవారు. గత కొన్నేళ్ల నుంచి కొన్న పంటలు సరైన దిగుబడులు లేక, దిగుబడి ఉన్నా కొన్ని పంటలకు ధరలు లేక అప్పులపాలయ్యారు. వర్షాలు సరిగా కురవడం లేదని నాలుగు బోర్లు కూడా వేశారు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని నాలుగేళ్ల క్రితం తనకున్న 4.67 ఎకరాల్లో రెండెకరాల భూమిని అమ్మేసి కొంత వరకు అప్పులు తీర్చారు. ఇప్పటికీ సుమారు రూ.10లక్షల అప్పు ఉంది. దీంతో ఆ అప్పులు ఎలా తీర్చాలోనని మనస్తాపం చెందేవారు. ఈ క్రమంలో ఈనెల 7న నాగన్న తన పొలం సమీపంలో పురుగు మందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న రైతును అటువైపు వెళ్తున్న వారు చూసి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు రైతును చికిత్స నిమిత్తం గుత్తికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. అయితే నాగన్న చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. నాగన్నకు భార్య జయమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు సోమశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మోహన్, సోమశేఖర్‌గౌడు, సుధాకర్ గౌడు నాగన్న మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

దేవనకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి కప్పట్రాళ్లకు చెందిన షేక్షావలి అనే వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. జిల్లేలబుడకలకు చెందిన మహిళ ఫిర్యాదుతో పోలీసులు షేక్షావలి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించారు. ఇరువర్గాల విచారణ అనంతరం స్టేషన్ ఎదుటనే షేక్షావలి పురుగుమందు తాగాడు. పోలీసుల వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. నెల నుంచి తిరుగుతున్న పోలీసులు న్యాయం చేయడం లేదని షేక్షావలి తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.

సిఫారసు లేఖ చిచ్చు

కర్నూలు హాస్పిటల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్యఆరోగ్య శాఖలో జరుగుతున్న బదిలీల్లో ఓ గుర్తింపు పొందిన యూనియన్ సిఫారసు లేఖ చిచ్చుపెట్టింది. కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఓ ఉద్యోగి 26ఏళ్లుగా లాంగ్ స్టాండింగ్‌లో పనిచేస్తున్నారు. ఈ ఉద్యోగికి గుర్తింపు పొందిన ఓ యూనియన్ రాష్ట్ర కమిటీ సిఫారసు లేఖను నేరుగా కడప ఆర్డీ కార్యాలయానికి పంపింది. జోనల్ క్యాడర్ ఉద్యోగికి రాష్ట్ర అధ్యక్షుడి సంతకంతో లెటరు ప్యాడ్ ఇవ్వడంపై జిల్లా యూనియన్, రాష్ట్ర యూనియన్‌కు మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఓ ఉద్యోగికి సిటీ జాయింట్ సెక్రటరీకి సిఫారసు లేఖను ఇస్తూ జిల్లా యూనియన్‌కు పంపించారు. ఈలేఖను జిల్లా యూనియన్ తిరస్కరించింది. అయితే ఉన్నట్టుండి రాష్ట్ర అధ్యక్షుడి సంతకంతో బదిలీల నుంచి మినహాయించే లేఖ ఇవ్వడం జిల్లా, రాష్ట్ర శాఖల మధ్య చిచ్చు రగులుతోంది. కాగా ఈ సిఫారసు లేఖ కోసం డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. కర్నూలు సిటీ కమిటీ ఇచ్చిన సిఫారసు లేఖ చెల్లదని జిల్లా అధ్యక్షుడు దాన్ని తిరస్కరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర శాఖ నేరుగా జిల్లా శాఖకు తెలియకుండా సిఫారసు లేఖను కడప ఆర్డీకి పంపించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో జిల్లా శాఖ నాయకులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. జిల్లా శాఖకు తెలియకుండా సిఫారసు లేఖ రాష్ట్ర శాఖ నేరుగా ఎలా ఇస్తుందని ప్రశ్నిస్తున్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

ఏపీఈఏపీ సెట్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో డీజీఎం గోవర్ధన్ రెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ రంగాల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో కర్నూలు నారాయణ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు డీజీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో డి.హేమసాగిరిక 21వ ర్యాంకు, ఆర్.గోవర్ధన్ చౌదరి 65వ ర్యాంకు, సఫా సైఫ్ ఖురైసీ 90, పి.దీపిక 102, ఎం.అఖిల్ బాలాజీ నాయక్ 104, వి.గురు పార్థివ్ 124, ఎం.సంహిత 213, డి.శ్రీసాయి సవేంద్ర 237, ఎం.కార్తీక్ 320, కె.గౌతమ్ 353, ఆర్.దివ్యశ్రీ 397 ర్యాం కులను సాధించారన్నారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో కె.చరణ్ కుమార్ 220వ ర్యాంకు, టి.మిథున్ సాయి కుమార్ 232, కే.జీవన్ కుమార్ 305వ ర్యాంకు, కె.సాయి శృతి 1136, జి.శివ శ్రీనివాస్ 1332, ఎస్.ఖరాన్షు 1445, డి.ధరణి 1508, సాయిభాస్కర్ 1565వ ర్యాంకులు సాధించారన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయ న అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డీన్లు ఆంజనేయరెడ్డి, విశ్వనాథరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులు..



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్‌లో విడుదలైన పరీక్ష ఫలితాల్లో కర్నూలు శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో బి.లక్ష్మీకాంత్ 363వ ర్యాంకు, బి.వశిష్ట క్రిష్ణ 427వ ర్యాంకు, జి.హిమవంత్ కుమార్ 852వ ర్యాంకు, ఆర్.ఉపేంద్ర రెడ్డి 873, టి.శ్వేత 918 ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య కళాశాలల ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. వీరితోపాటు 106 మంది విద్యార్థులు 10వేలలోపు ర్యాంకులు సాధించారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, తీర్చిదిద్దిన అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో డీన్స్ సరళ, బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నటేకూరు బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో చిన్నటేకూరు డా.బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాణించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో కుమ్మరి గణేష్ 113.44 /160 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 357వ ర్యాంకు సాధించారు. పదివేలలోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు విద్యార్థులున్నారు. వీరిలో గాది సురేంద్ర 1258వ ర్యాంకు, మడిగ సాయి 2155, కుందురు సాయిక్రిష్ణ 2241, చోప్రా జ్యోతిష్ కుమార్ 2391, నీలేపల్లె ధనుష్ 4511 ర్యాంకులు సాధించారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో నవదీప్ 76.41 మార్కులతో 4996వ ర్యాంకు, బనావత్ నానాజీ నాయక్ 4986, పెద్దిపీటి అకిల్ కుమార్ 5295, మేకా నాగ కార్తీక్ రెడ్డి 5308 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు, ర్యాంకులు సాధించిన విద్యార్థులను జిల్లా కోఆర్డినేటర్ ఐ.శ్రీదేవి, ఐఐటీ మెడికల్ అకాడమీ డైరెక్టర్ బి.ఉమామహేశ్వరప్ప అభినందించారు.

బయో మైనింగ్ పూర్తి చేయాలి: కమిషనర్



డంప్‌యార్డులో మైనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గార్గేయపురం డంప్ యార్డులో జరుగుతున్న బయో మైనింగ్ ప్రక్రియ వచ్చే నెలాఖరికి పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం డంప్ యార్డులో జరుగుతున్న బయో మైనింగ్ పనులను ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ గార్గేయపురం డంప్‌యార్డులో కొన్నేళ్ల క్రితం బయో మైనింగ్ ప్రక్రియ చేపట్టిందన్నారు. డంప్‌యార్డులో 64 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలకు చెత్తా శుద్ధీకరణ లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికి 43 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలకు బయో మైనింగ్ ప్రక్రియ పూర్తి అయిందన్నారు. మిగిలిన 22 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను వచ్చే నెలాఖరికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అంతకుముందు కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించారు. నగరంలోని ఓ హోటల్ వద్ద అపరిశుభ్రంగా ఉండటంలో నిర్వాహకుడిపై అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, సిబ్బంది ఉన్నారు.

నెలకే కంకర తేలింది..

ప్రజాధనం దుర్వినియోగం

కర్నూలు న్యూసిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో ప్రతి ఏటా లక్షలు వెచ్చించి రోడ్ల మరమ్మతులు చేస్తున్నారు. అవన్నీ నాసిరకంగా నిర్మించడంతో ఏడాది కూడా రావడం లేదు. దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. సమపాళ్లలో సిమెంటు వేయకపోవడం మరమ్మతులు తరువాత క్యూరింగ్ చేయడం లేదు. నాసిరకం రోడ్ల మరమ్మతు పనులను చూడకుండనే అధికారులు కళ్లు మూసుకని సంతకాలు చేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లు యథే చ్ఛగా బిల్లులు చేసుకుంటున్నారు. అశోక్‌నగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో, విష్ణుటౌన్‌షిప్‌లో సిమెంటు రోడ్ల మరమ్మతులు చేసి నెల తిరగక ముందే కంకర తేలింది. గత ఏడాది కౌన్సిల్ సమావేశ భవనానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. అప్పుడే రోడ్డుపై కంకర తేలింది.



అశోక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద కంకర తేలిన రోడ్డు

కంటికి వైద్యమేదీ?

● వైద్యులు లేక రోగుల ఇక్కట్లు

● పట్టించుకోని అధికారులు

ఓర్వకల్లు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు, హుశేనాపురం సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కంటి వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆయా సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో ఆప్తాలిక్ ఆఫీసర్‌గా సత్యనారాయణ పని చేసేవారు. ఆయన పదవీ విరమణ ఏడాదిన్నర కావస్తున్నా ఓర్వకల్లు సీహెచ్‌సీ, హుశేనాపురం పీహెచ్‌సీ కంటి వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేంద్రాల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహించే వైద్యుడే లేకపోవడంతో కంటి రోగులు కర్నూలు, నంద్యాల పట్టణాలకు వెళ్లాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓర్వకల్లు సీహెచ్‌సీకీ, హుశేనాపురం పీహెచ్‌సీలకు వందలాది మంది రోగులు కంటి జబ్బులు చూపించుకునేందుకు వచ్చేవారు. ఇక్కడ కంటి వైద్యులు కరువయ్యారు. గతంలో ప్రతి సోమవారం హుశేనాపురంలో, ప్రతి బుధవారం ఓర్వకల్లులో కంటికి సంబంధించిన పరీక్షలను ఆప్తాల్మిక్ ఆఫీసర్ నిర్వహించేవారు. ఆఫీసర్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదిన్నర క్రితం పదవీ విరమణ పొందిన ఈ ఆసుపత్రుల్లో ఆప్తాల్మిక్ ఆఫీసర్‌ను నియమించకపోవడం సరికాదని రోగులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో కంటి జబ్బులు అధికంగా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కంటి వైద్య నిపుణుడిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



ఓర్వకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రం

అధికారులు స్పందించాలి



ఓర్వకల్లు సీహెచ్‌సీలో ప్రతి సోమవారం వంద మంది నుంచి 150 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు గతంలో నిర్వహించే వారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా కంటి అద్దాలు, డ్రాప్స్ ఇచ్చేవారు. అవసరమైన రోగులకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు కూడా నిర్వహించేవారు. ప్రస్తుతం కంటి వైద్యం అందడం లేదు. అధికారులు స్పందించి కంటి వైద్యుడిని నియమించాలి

● వేణుగోపాల్‌రెడ్డి, ఓర్వకల్లు

ఆప్తాలిక్ ఆఫీసర్‌ను నియమించాలి



ఆసుపత్రిలో ఆప్తాలిక్ ఆఫీసర్ లేక ఓర్వకల్లు, హుశేనాపురం సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో వైద్యం అందక కంటి జబ్బులతో కంటి చూపు కోల్పోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి ఆప్తాల్మిక్ ఆఫీసర్‌ను నియమించి మెరుగైన వైద్యసేవలు అందించాలి.

● నాగరాజు, హుశేనాపురం

కమీషన్ల విషయంలో గొడవ

● పలువురిపై దాడి

కర్నూలు క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ల వ్యాపారంలో కమీషన్ల విషయంలో జరిగిన గొడవలు పలువురిపై దాడికి కారణమయ్యాయి. ఈ ఘటన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ శ్రీనివాస్‌నగర్ కాలనీలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కాలనీలో నివాసం ఉంటున్న రాజలింగం, అతడి రెండో భార్య సుభద్ర, ఆయన తమ్ముని కొడుకు వెంకటరమణలపై రాంబాబు అనే వ్యక్తి, అతని అనుచరులు ఆదివారం సాయంత్రం దాడిచేసి గాయపరిచారు. రాజలింగం, రాంబాబుల మధ్య గతంలో ప్లాట్ల విషయం, అందులో వచ్చే కమీషన్లపై మన స్పర్థలు ఉన్నాయి. వీటిపై గతంలో కూడా ఒకరిపై ఒకరు కూడా కేసులు పెట్టుకున్నారు.. ఆదివారం మధ్యాహ్నం రాజలింగం ఓవ్యక్తి అంత్యక్రియలకు వెళ్లగా.. అక్కడ రాం బాబుతో గొడవ జరిగింది. అక్కడున్న వారు సర్దిచెప్పి పంపించేశారు. సాయంత్రం రాజలింగం ఇంట్లో ఉండగా రాంబాబు ఆయన సోదరుడు అనుచరులు అబ్రహం, మత్తయ్య మరి కొందరు వచ్చి రాజలింగం, ఆయన రెండో భార్య సుభద్రను కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. విడిపించే ప్రయత్నం చేసిన వెంకటరమణ అనే వ్యక్తిపై కూడా దాడిచేశారు. గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలి: సీపీఐ

కర్నూలు న్యూసిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా నాయకుడు కె.జగన్నాథం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. జగన్నాథం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం దారుణమన్నారు. కర్నూలు నుంచి విజయవా డకు ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని, అలాగే తిరుపతి నుంచి కర్నూలుకు రైలు నడపాలని డిమాండ్ చేశారు. కర్నూలు టు గుంతకల్ మీదుగా ముంబైకి ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యవర్గసభ్యుడు అన్వర్, రామాంజనేయులు, బి.రాముడు, ప్రసాద్, మహేష్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

జర్నలిస్టుల వ్యాఖ్యలపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

కర్నూలు క్రైం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిపై, అక్కడున్న మహిళలను కించపరిచే విధంగా జగన్ మీడియా జర్నలిస్టులు చేసిన వ్యాఖ్యలపై జిల్లాలో మహిళలు గళమెత్తారు. పలు పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తెలుగు మహిళా కమిటీ అధ్యక్షులు ముంతాజ్, మారుతిశర్మ, భాగ్యలక్ష్మి మహిళలు, మరికొంత మంది మహిళలు కలిసి ఫిర్యాదు చేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి రాజధానిని దేవ తల రాజధాని అని కొనియాడితే.. జగన్ మీడియా జర్నలిస్టులు నీచంగా వేశ్యల రాజధాని అనడం, దీనికి అదే డిబేట్‌లో ఉన్న మరో జర్నలిస్టు ఆయనకు వంత పలకడంపై నీచమైన చర్య అని వారు విమర్శించారు. వైసీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తుందని, మహి ళలు అని ఆత్మకు క్షోభకు గురి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

● తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో మామిదాలపాడుకు చెందిన బండారు పద్మ అనే మహిళ కూడా మరికొందరు మహిళలతో కలిసి ఫిర్యాదు చేసింది. మహిళలను కించపరిచి వారి మనోభావాలు దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. జగన్ మీడియా జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మహిళలను కించపరచడం సరికాదు

కర్నూలు అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను జగన్ మీడియాకు చెందిన జర్నలిస్టులు కించపరచడం సరికాదని తెలుగు దేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీ పద్మచౌదరి అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వి.హనుమంతరావు చౌదరితో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని, నిర్ధేశిత గడువులోపు పరిష్కారం పొందవచ్చని కమిషనర్ ప్రజలకు సూచించారు.

మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మార్షల్‌ఆర్ట్స్‌తో క్రమశిక్షణ అలవడుతుందని నాయకుడు బొల్లెద్దుల సాయి పవన్ కాంత్ అన్నారు. ఆదివారం నగరంలోని కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కులో తైక్వాండో క్రీడాకారులకు బ్లాక్‌బెల్టులు ప్రదానం చేశారు. డాన్ కౌసిక్, డాన్ జాహ్నవి బ్లాక్‌బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోచ్ నందిని, అశ్విని, లలిత, అభయ్, మల్లికార్జున పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



సైక్లింగ్ చేస్తున్న అధికారులు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ క్రమ తప్పకుండా సైక్లింగ్ చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారని కర్నూలు రైల్వేస్టేషన్ మాస్టర్ శేషఫణి అన్నారు. ఆదివారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయి) ఆధ్వర్యంలో సైక్లింగ్ ర్యాలీని ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మున్నాజీరావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. శాయి ఇన్‌చార్జి చంద్రశేఖర్, సైక్లింగ్ కోఆర్డినేటర్ కార్తికేయన్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ జతిన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజయంతో తిరిగి రావాలి

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని తాడిపత్రిలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటి విజయంతో తిరిగి రావాలని మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి అన్నారు. ఆదివారం జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొనే విజేతలకు ఆమె ప్రశంసా పత్రం, మెడల్స్ అందజేశారు. నగరూరు రాఘవేంద్ర, తైక్వాండో కార్యదర్శి సతీష్ కుమార్, డిఫెన్స్ అకాడమి సోమేశ్వరి, వీరేష్‌బాబు, శివన్న పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా

కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

కోడుమూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలను పరిష్కరిస్తామని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానులతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విషువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం జీడీపీ నుంచి కోడుమూరుకు పైపులైను ద్వారా తాగునీటిని తీసుకురావాలని ఇదివరకే ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదికలు సమర్పించామన్నారు. త్వరలో నిధులు విడుదల చేయించి కోడుమూరు ప్రజల చిరాకాల కోరికను తప్పకుండా తీరుస్తాని చెప్పారు. అలాగే ఖరీఫ్, రబీ సీజన్‌లో ఎల్లెల్సీ, జీడీపీ నుంచి సకాలంలో నీటిని అందించి రైతుల వేసిన పంటలను కాపాడి, వారి ఆర్థిక అభివృద్ధికి పాటు పడతానని అన్నారు. రాబోయే సర్పంచు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుగొండ రామకృష్ణారెడ్డి, రవీంద్రగౌడ్, గంగాధర్‌నాయుడు, బలరాం, రాముడు, అయ్యప్ప పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు హాస్పిటల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని టీజీవీ నగర్‌లో ఉన్న కృపా వృద్ధాశ్రమానికి గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ నెలరోజులకు సరిపడ నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో దాదాపు 30 మంది వృద్ధులు ఉన్నారని, వారికి ఆశ్రయం కల్పించిన నిర్వాహకుడు అబ్రహంను అభినందించారు. మానసిక వికలాంగుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడుతానన్నారు.

క్రీడాకారులకు కరాటే బెల్టులు ప్రదానం

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యూనివర్సల్ బుడోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పెద్ద మార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాగణంలో కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ప్రతిభను కనబరిచిన క్రీడాకారులకు గ్రీన్, ఆరేంజ్, రెడ్ బెల్టులను సాధించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హర్ష గీత రెడిమేడ్ షోరూం అధినేత గంగాధర్ క్రీడాకారులకు బెల్టులను అందజేశారు. జిల్లా ఒలింపిక్ అసోసి యేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు, యూనివర్సల్ బుడోకాన్, కరాటే మాస్టర్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు హాస్పిటల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీ సాంప్రదాయ మత్స్యకారుల సంక్షేమ సంఘం (తెలుగు బెస్త గంగ పుత్ర) కర్నూలు సిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని టి.శేషన్నగనర్ గంగపుత్ర కమిటీ హాలులో గౌరవాధ్యక్షుడిగా టి.గోవిందుస్వామి, అధ్యక్షుడిగా అమ్మ మెస్ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కొత్తిమిర వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. సి.మద్దిలేటి, తుంగ రమేష్, హాస్పిటల్ శివుడు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

కర్నూలు కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్‌లో ఈనెల 10 నుంచి 15 వరకు జరుగనున్న థాయ్‌లాండ్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ 2025 లెవల్-2 పోటీలకు దేశం తరపున ఆ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న కర్నూలు క్రీడాకారుడు రామాంజనేయులుకు ఖర్చుల నిమిత్తం రూ.40వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో ఆవోపా ప్రతినిధి నాగేశ్వరరావు ఈఆర్థిక సహాయం అందజేసి ఆయనకు వీడ్కోలు పలికారు. పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నారాయణ, గోనూరు యుగంధర్ శెట్టి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు



సవారమ్మగుడి దగ్గర ఉన్న మలుపు

సి.బెళగల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌కు సమీపంలో ఉన్న సవారమ్మ గుడి దగ్గర ఉన్న మలుపు ప్రమాదకంగా మారింది. ఈమలుపు ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువా తపడ్డారు. ఆ ప్రాంతంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మలుపు వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విజ్ఞాన పీఠంలో అనాథ బాలురు చేరిక



విజ్ఞాన పీఠం ప్రతినిధులతో అనాథ బాలురు

కర్నూలు కల్చరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జి.పుల్లారెడ్డి నగర్‌లోగల విజ్ఞాన పీఠం (అరక్షిత శిశు మందిరం) అనాథ శరణాలయంలో ఆదివారం 40 మంది బాలురు (విద్యార్థులు) చేరారు. ఈ సందర్భంగా విజ్ఞాన పీఠం కార్యదర్శి సి.మాణిక్యరెడ్డి మాట్లాడుతూ అరక్షిత బాలలకు విజ్ఞాన పీఠం ద్వారా హైస్కూలు వరకు ఉచితంగా వసతి, భోజనం, వైద్యం, విద్యాబోధనకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. కోశాధికారి రంగారెడ్డి మాట్లాడుతూ ఎక్కడైనా అనాథ బాలు రు ఉన్నట్లయితే వారిని తీసుకువచ్చి విజ్ఞాన పీఠంలో చేర్చవచ్చని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన పీఠం హెచ్ఎం మాళిగి వ్యాస రాజ్, ఉపాధ్యాయులు చంద్రమోహన్, రామగోవిందప్ప, రణధీర్ రెడ్డి, సుదర్శన్‌రావు, స్వర్ణలత, ఎస్ రామిరెడ్డి, వంశీ రాఘవ, శ్రీనివాసులు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ సమ్మర్ క్యాంప్



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎస్ఐ

కోడుమూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ మైదానంలో గత 40 రోజులపాటు సీఐ తబ్రేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ సమ్మర్ క్యాంప్‌ను ఆదివారం క్యాంప్ ముగిసింది. కార్యక్రమానికి ఎస్ఐ డీవై స్వామి హాజరై మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయన్నారు. సమ్మర్ క్యాం ప్‌లో వాలీబాల్ ఆటలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఇందులో భాగంగా కర్నూలులోని సోహెల్ ఎలక్ట్రికల్స్ యాజమాన్యం విద్యార్థులకు స్పోర్ట్స్ జెర్సీలను అందజేశారు. కోచ్ నోమిత ప్రభ, కానిస్టే బుల్, హోంగార్డ్స్ భాస్కర్, విజయ్, దస్తగిరి, సాగర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వంక ప్రదేశంలో ఏర్పడ్డ గుంతలు

కోడుమూరు రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రదొడ్డి- అనుగొండ గ్రామాల మధ్య వంక దగ్గర ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వర్షపునీరు పోటె త్తింది. దీంతో వంక (లడ్డుగానివంక) దగ్గర రోడ్డును ఆనుకుని గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడ మట్టి కోతకు గురికావడంతో ప్రమాదకరంగా మారింది. ఇటువైపు అనుగొండ, ఎర్రదొడ్డి, రేమడూరు గ్రామాల నుంచి ఆటోలు, బైక్‌లపై ప్రయాణం సాగిస్తుంటారు. రాత్రి సమయాల్లో గుంతల చోట ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతుంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు కందులు ఇవ్వాలి

మద్దికెర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ఆరంభమైందని, రైతులకు వంద శాతం రాయితీతో కందులు ఇవ్వాలని జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్లు, మండల వైసీపీ అధ్యక్షులు మల్లికార్జున యాదవ్, మండల వైసీపీ ఉపాధ్యక్షులు కృష్ణాయాదవ్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు కందులు అందజేయాలన్నారు. ముందస్తు వర్షాలు పడటం వల్ల విత్తన సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నారన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు భూమి పూజ



ఆంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు భూమి పూజ చేస్తున్న బొమ్మన దశరథరామిరెడ్డి

వెల్దుర్తి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పట్టణంలోని ఒకటో వార్డులో వెలసిన బాలాంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు భూమి పూజ ఆదివారం నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే అర్చకులు, పండితుల వేదమంత్రోచ్చారణల పూజలతో గ్రామ పెద్దలు బొమ్మన దశరథరామిరెడ్డి దంపతులు భూమి పూజా కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. బొమ్మన దశరథరామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.30 లక్షలతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కాంట్రాక్టరు ఎల్ల నాగిరెడ్డి, పెద్ద కోదండరాముడు, భాస్కర్‌గౌడు, ఎల్లమ్మగుడి పూజారులు నీలకంఠం, శివ, ఓమేంద్రబాబు, మాజీ ఎంపీటీసీ రవికుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

కురువ సామాజిక అభివృద్ధికి కృషి

● జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున



నూతనంగా ఎన్నికైన కురువ సంఘం జిల్లా కమిటీ

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మాదాసి కురువ, మాదారి కురుబల సామాజిక అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన జిల్లా కురువ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. ఆదివారం స్థానిక బీరప్ప గుడిలో రాష్ట్ర కురువ/కురుమ వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అధ్యక్షతన జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. అర్హులైన వారికి కార్పొరేషన్ ద్వారా రుణాలు అందేలా చూస్తారని వాటి ద్వారా ఆర్థికంగా బలోపేతం అవుదామన్నారు. తాత్కాలిక జిల్లా అధ్యక్షుడిగా వెంకన్న గిరి, కే మల్లికార్జున, ఆదోని అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఎల్లార్తి దర్గన్న, ప్రధాన కార్యదర్శిగా శివ నారాయణ సహాయ కార్యదర్శిగా కుంటనహాల్ శివరాం, చిన్నగిడ్డయ్య, ఉపాధ్యక్షులుగా కే మెడికల్ నాగరాజు, దిబ్బనకల్లు లక్ష్మన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అంజి

దేవనకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అంజి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం దేవనకొండ క్రాస్ రోడ్డులో మండల అధ్యక్షులు పరమేష్ అధ్యర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో బోయ, వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉన్నారని, మరి కొన్ని జిల్లాల్లో బీసీ జాబితాలో ఉన్నందునా ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. జూలై 2న ఆలూరులో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో లింగప్ప, రాముడు, రంగన్న పాల్గొన్నారు.

రహదారులు వేయాలి



మంత్రిని కలిసిన వెంకటపతి

తుగ్గలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలంలో గిరిజన గ్రామాల్లో సీసీ రహదారులు లేవని, సీసీరోడ్లు నిర్మించాలని రాష్ట్ర ట్రైబల్ సలహా మండలి సభ్యులు వెంకటపతి కోరారు. ఆదివారం బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. చిన్నపాటి వర్షానికే వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయని, సీసీరోడ్లు నిర్మించాలని కోరారు.

మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా గోవర్దన్ నాయుడు



పత్తికొండ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన డైరెక్టర్ బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్దన్ నాయుడుకు నూతన పాలకవర్గ కమిటీలో చోటు దక్కింది. బీజేపీ క్రియాశీలకంగా పని చేస్తున్న గోవర్దన్ నాయుడును మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గోవర్దన్ నాయుడు మాట్లాడుతూ మార్కెట్ యార్డు అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. గోవర్దన్ నాయుడు నియామకం పట్ల స్థానిక బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయవాదిపై దాడి అమానుషం

పత్తికొండ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది గురు రాజారావుపై దాడి అమానుషమని న్యాయవాది రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మంత్రాలయం మండలంలో మాలపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది గురురాజుపై కొందరు దుండగులు దాడి చేసి గాయపరిచారని అన్నారు. నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని కోరారు.

'షైనింగ్ అవార్డు' కు ఏడుగురు విద్యార్థుల ఎంపిక

వెల్దుర్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఉత్తమ మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓ ఇందిర తెలిపారు. మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన బోయ మహేశ్వరి(బీసీ-ఏ), టీ కేశమ్మ(బీసీ-ఏ), ఎం అర్షితవర్షిని(బీసీ-డీ), జీ హాసిని(ఓసీ), ఎం సింధు(ఓసీ), ఎం సౌమ్య(ఎస్సీ), ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలకు చెందిన టీ దివ్య(ఎస్టీ) లు ఎంపికయ్యారన్నారు. సోమవారం కర్నూలు పెద్దపాడు వద్దఉన్న పుష్పరాజ్ ఫంక్షన్ హాలులో అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.20 వేల నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రం డీఈఓ శామ్యూల్‌పాల్ అందజేస్తారన్నారు.

అడ్మిషన్లు తేకుంటే జీతం కట్!





అడ్మిషన్లు తెస్తారా?.. చస్తారా? తేల్చుకోండి.. అని ప్రైవేట్ విద్యా సంస్థల యజమానులు ఉపాధ్యాయులను వేధిస్తున్నారు. టార్గెట్ పెట్టి మరీ ఇంటింటికి తిరిగి అడ్మిషన్లు తేవాలని ఆదేశిస్తున్నారు. లేకపోతే జీతం కట్ అని మెడ మీద కత్తి పెడుతున్నారు. దీంతో మండుటెండల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతున్నారు.

- ఆలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):

● ప్రైవేటు టీచర్ల మెడపై కత్తి
● స్కూళ్లలో పిల్లలను చేర్పించే టార్గెట్లు
● ఇంటింటి ప్రచారం చేయాలని ఆదేశం

జిల్లాలో 832 ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టార్గెట్ విధించి కొత్తగా అడ్మిషన్లు తీసుకరావాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మీ ఇంట్లో చదువుకునే పిల్లలు ఉన్నారా? ఉంటే ఏం చదువుతున్నారు? అనే సమాచారం సేకరిస్తున్నారు. పిల్లలను తమ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను బతిమిలాడుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక పీజీ, డిగ్రీ, బీఈడీలు చేసిన ఎంతోమంది ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి రెండు నెలల ముందే వీరికి యాజమాన్యాలు విద్యార్థుల ప్రవేశాలకు టార్గెట్ విధించడంతో ఉపాధ్యాయులు రోడ్డు మీద పడ్డారు.



యాజమాన్యాల టార్గెట్లు

విద్యార్థుల సంఖ్యను పెంచుకోడానికి ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు తమ స్కూళ్లలో, కాలేజీల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు టార్గెట్ విధిస్తున్నారు. ఒక్కొక్కరు కనీసం ఐదు నుంచి 10 మందిని చేర్పించాలనే నిబంధన పెట్టారు. ఇచ్చిన అడ్మిషన్ల టార్గెట్లు పూర్తి చేస్తేనే సెలవుల్లో జీతాలు ఇస్తామనే హెచ్చరికను కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు జారీ చేసి, వారితో బలవంతంగా అడ్మిషన్లు చేయిస్తున్నారు. ఇచ్చే అరకొర జీతాలు నిలిపి వేస్తారనే భయంతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు నానా తంటాలు పడుతున్నారు. మండే ఎండల్లో ఇంటింటికి తిరుగుతూ నానా కష్టాలు పడుతున్నారు. దీని కంటే యజమానులు మాట్లాడే బాష, ప్రవర్తన ఉపాధ్యాయులను మరింత ఇబ్బంది పెట్టేలా ఉందని పలువురు ప్రైవేట్ ఉపాధ్యాయులు వాపోతున్నారు. అడ్మిషన్ల వేటలో నోటికి ఏది వస్తే అది మాట్లాడి తమ మనోభావాలు దెబ్బతీస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

విద్యార్థులను చేర్పించే పని ఉపాధ్యాయులకు లేదు. ఇలా ఎవరైనా ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు టార్గెట్లు ఇస్తే మాకు ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే మేము ఆ విద్యాసంస్థల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చి వివరణ కోరతాం. అవసరమైతే చర్యలు కూడా తీసుకుంటాం.

- శ్యామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు

ఫీజుల మోత....



విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు వసూలు చేయాలి. ఈ నిబంధన ఏ ప్రైవేట్ పాఠశాలలో కూడా అమలు కావడం లేదు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయి నుంచే భారీగా ఫీజులు దండుకుంటున్నారు. టెక్నో, ఈటెక్నో, సీబీఎస్ఈ, ఐఐటీ కోచింగ్, అబాకస్ స్పోకెన్ ఇంగ్లిష్, కరాటే, డ్రాయింగ్ తదితరాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారాన్ని మోపుతున్నారు. దీనికి అదనంగా యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు, సాక్సులు, టై వంటివి తమ పాఠశాలల్లోనే అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు.

- ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులు



ఒకవైపు ప్రత్యేక తరగతుల్లో బోధన, మరోవైపు అడ్మిషన్ల టార్గెట్లు పూర్తి చేసే పనిలో ప్రైవేట్, కార్పొరేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర ఒత్తిడికిలోనై మానసికంగా శారీరకంగా ఇబ్బంది పడుతున్నారు. తమ వేదనను ఎవరికీ చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్నారు. చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్న పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగాన్ని కూడా వదులుకోలేక, యాజమాన్యాల ఒత్తిడి తట్టుకోలేక వారు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో పని చేసే టీచర్లకు యాజమాన్యాలు చాలీచాలని వేతనాలివ్వడమేగాక అడ్మిషన్ల టార్గెట్ ఇవ్వడం అమానుషమనే విమర్శలు ఉన్నాయి.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



యోగా చేస్తున్న చిన్నారులు

యోగాతో ఆరోగ్యం పదిలం

ఆదోని, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో యోగాను ఓ భాగం చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మండల అధికారులు, సిబ్బంది, స్థానికులు దాదాపు 1000 మందితో యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించి యోగాను నిత్య ప్రక్రియగా చేసుకోవాలన్నారు. 2047 నాటికి ప్రతి ఒక్కరు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలన్నాదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఉప తహసీల్దార్ వలిబాష, యోగాభ్యాసకులు పాల్గొన్నారు.



పత్తికొండలో యోగా కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది

పత్తికొండ: యోగాతో ఆరోగ్యం పదిలం అని ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో బాగంగా ఆదివారం పత్తికొండ డిగ్రీ కళాశాల మైదానంలో డివిజన్ పరిధిలోని అన్నిశాఖల అధికారులు, సిబ్బందికి యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 21 జరిగే జాతీయ యోగాదినోత్సవాన్ని ప్రజలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలి

పత్తికొండ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కరోనా కంటే ముందు నడుపుతున్న ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా ప్రాంతం నుంచి అత్యధికులు రాష్ట్ర రాజధాని అయిన విజయవాడ, గుంటూరు, బెంగుళూరు, హైదరాబాదు సుదూర ప్రాంతాలకు ఈ ప్రాంత ప్రజలు పనుల నిమిత్తం, జీవనోపాధులకు వలస వెళ్తుంటారన్నారు. అయితే కరోనా సమయంలో పలు ప్రాంతాలకు రైళ్లను అధికారులు నిలిపివేయడంలో ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చొరవ చూపి రైళ్లను పునఃప్రారంభించి యథావిధిగా కొనసాగించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కారుమంచి రామాంజనేయులు, కృష్ణయ్య, వీరన్న, సుంకన్న, వెంకట్రామిరెడ్డి, నెట్టికంటయ్య పాల్గొన్నారు.



పత్తికొండలో సంతకాల సేకరణ చేపట్టిన సీపీఐ నాయకులు

తుగ్గలి: కరోనా సమయంలో రద్దయిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని సీపీఐ మండల అధ్యక్షుడు సుల్తాన్, తాలుకా వ్యవసాయ సంఘం కార్యదర్శి ఉమాపతి కోరారు. ఆదివారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్‌లో కరోనా సమయంలో రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సూరారెడ్డి, వెంకటేశ్వర్లు, పీరా, మద్దిలేటి తదితరులు ఉన్నారు.



పెండేకల్ ఆర్ఎస్‌లో సంతకాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

10న శివాలయానికి రెండో వార్షికోత్సవాలు

తుగ్గలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నునుసరాళ్లలో రూ.కోటితో నిర్మించిన శివాలయం నిర్మాణం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి కావడంతో 10న ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం శివాలయంలో పూజలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ రెండో వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా శివుడికి ప్రత్యేక అభిషేకాలతో పాటు యజ్ఞయాగాలు నిర్వహిస్తున్నామని, చందాలు ఇచ్చిన దాతలు, భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

అమరావతి మహిళలను కించపరచడం దారుణం

ఆలూరు, జూన్8(ఆంధ్రజ్యోతి): అనేక త్యాగాలు చేసి రాజధాని అమరావతికి భూములిచ్చిన మహిళా రైతులను కించపరుస్తూ జగన్ మీడియాలో మాట్లాడడం దారుణమని, తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆలూరు నియోజకవర్గ టీడీపీ మహిళా నేత వైకుంఠం జ్యోతి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మహిళలను అవమానపరిచి, అగౌరవంగా మాట్లాడిన వారికి శిక్షలు తప్పవని సీఎం చంద్రబాబునాయుడు గతంలో చెప్పారని, దానికి అనుగుణంగా మాజీ సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతిని అవమానకరంగా మాట్లాడిన సొంత పార్టీ కార్యకర్తపై కేసులు పెట్టించి చిత్తశుద్ధి నిరుపించుకున్నారన్నారు. అయితే రాజధాని అమరావతికి భూములిచ్చిన మహిళలపై నీచంగా మాట్లాడిన వారిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, మహిళా చైర్‌పర్సన్ రాయపాటి శైలజ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్దికెర: ఐదు కోట్ల ఆంధ్రుల రాజధానిని వేశ్యలతో పోల్చడం దుర్మార్గమని మాజీ ఎంపీపీ, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు గూడూరు పద్మావతి అన్నారు. ఆదివారం ఆమె స్వగృహంలో మాట్లాడుతూ జర్నలిస్టు కృష్ణంరాజు చర్చ పెట్టిన కొమ్మినేని శ్రీనివాసరావుపై వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. జగన్ మీడియా యాజమాన్యం మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తగిన బుద్ధి చెబుతారన్నారు.

● ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను తీవ్రంగా కించపరిచేలా మాట్లాడుతున్న జగన్ మీడియాకు మూల్యం చెల్లించుకోక తప్పదని తాలుకా తెలుగు మహిళా అధ్యక్షురాలు జానకీ చౌదరి, మండల తెలుగు యువత అధ్యక్షురాలు గూడూరు కవితా యాదవ్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ మహిళల ఆత్మాభిమానం మీద, అమరావతి మీద విద్వేషంతో చేస్తున్న అసత్య ప్రచారం వారి దిగజారుడుతనానికి పరాకాష్ట అన్నారు. అమరావతి మహిళల జోలికి వచ్చిన జర్నలిస్టులపై కేసులు నమోదు చేయాలన్నారు.

మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు

పత్తికొండ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో మైనింగ్, క్వారి లీజు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో మినరల్స్, గోల్డ్, కాపర్, బ్లాక్ గ్రానైట్, మెటల్ వంటి చిన్న, పెద్ద ఖనీజ భారీ లీజులకు ప్రసిద్ధి చెందిన ప్రాంతమన్నారు. ఈ ప్రాంతంలో మైనింగ్, క్వారీ లీజుల నిర్వహణలో అక్రమాలు, అవకతవకలపై తీవ్ర ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. పర్యావరణ నష్టం చట్టవిరుద్ధ వంటి సమస్యలు స్థానిక ప్రజల జీవనోపాధి ప్రభుత్వ ఆదాయాన్ని సహజన వనరులను ప్రభావితం చేస్తున్నాయన్నారు. ఈ అక్రమాలపై ప్రధాన కారణాలు మైన్‌ఫండ్స్ జియాలజీ శాఖలో పర్యవేక్షణ లోపం, రాజకీయ ప్రభావం, అధికారుల నిర్లక్ష్యం, లీజు దరఖాస్తుల అనుమతుల ప్రక్రియలో పారదర్శకత లోపించడం వంటి కారణాలు ఉన్నాయన్నారు. ఈ అక్రమాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలో కూర్చున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం యూనియన్ అధ్యక్షుడు పీరా సాహెబ్, కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. ఐదు రోజులుగా కాంట్రాక్టు కార్మికులు నిరసన దీక్షల్లో భాగంగా ఆదివారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దశాబ్ద కాలంగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమను గుర్తించకపోవడం అన్యాయం అన్నారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో దీక్షలకు పూనుకున్నామన్నారు. టెక్నికల్ కార్మికులకు రూ. 29,500, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ. 24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్లు పూర్తి చేసుకున్న వారికి క్రమబద్ధీకరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు తమకు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అహ్మద్ భరత్, ఈరన్న, రామాంజినేయులు, కుమార్, కర్రెప్ప, శరత్ శంకర్, మహమ్మద్, బసవరాజు, దేవేంద్ర, శివకుమార్ పాల్గొన్నారు.



గ్రామ శివారులో బోరు వద్ద నీరు తెచ్చుకుంటున్న గ్రామ ప్రజలు

తాగునీటికి కటకట

మద్దికెర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌బజారు బీరప్పవీధితో పాటు మరికొన్ని ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. గత పది రోజులుగా పంచాయతీ పైపులైన్ పగిలిపోవడంతో నీటికష్టాలు మొదలయ్యాయి. సాయినగర్ కాలనీలో మొత్తం 500 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ ప్రాంతంలో ఒక బోరు కూడా లేదు. జల్‌జీవన్ కింద ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి ఇంటింటికి కొళాయి నిర్మించినప్పటికీ ఇంత వరకు నీటి సరఫరా చేయలేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు గ్రామ శివారులోగల వ్యవసాయ బోర్లకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

● పైపులు పగులకొట్టిన వారిపై కేసులు పెట్టాం

మద్దికెర గ్రామానికి నీటి సరఫరా చేసే బుగ్గ వాటర్ స్కీం పైపులైన్లు పగులకొట్టిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. పైపులైన్లు మరమ్మతులు చేయిస్తున్నామని, నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం.

- శివకుమార్, పంచాయతీ కార్యదర్శి

నేడు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం


చైర్మన్ మల్లయ్య

ఎమ్మిగనూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం సోమవారం చేయనుంది. మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటు చేస్తు రాష్ట్ర ప్రభుత్వం మే 30న మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కురువ మల్యయ్యతో పాటు మరో 14మంది డైరెక్టర్లను నియమిస్తు జీవో జారీ చేసింది. దీంతో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారాణానికి మార్గం సుగమమం అయ్యింది. అయితే గత నెలలో టీడీపీ మహానాడు ఉండటంతో ఆలస్యం అవుతూ వచ్చింది. సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆద్వర్యంలో ప్రమాణస్వీకారం జరగనుంది. అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితో పాటు పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజుతో పాటు పలువురు జిల్లా ప్రజాప్రతినిధులు, నేతలు హాజరుకానున్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, చైర్మన్‌గా గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురువ మల్లయ్య, వైస్‌చైర్మన్‌గా దైవందిన్నెకు చెందిన బోయ అంజిని, డైరెక్టర్లుగా నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన బండారు లక్ష్మి, గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామానికి చెందిన బోయ ప్రభాకర్, ఎమ్మిగనూరు మండలం పార్లపల్లికి చెందిన రామచంద్రమ్మ, బనవాసి గ్రామానికి చెందిన జకతపు అబ్రహాం, మాసుమాన్ దొడ్డికి చెందిన గుర్రం కమ్మ కవిత, నందవరం మండల హాలహర్వి గ్రామానికి చెందిన ఎం దుబ్బన్న, నాగలదిన్నె గ్రామానికి చెందిన కరణం సుధీర్, గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాజెక్టుకు చెందిన నూగూరు షాహి న్, ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన తెలుగు శశికళ, నందవరం మండల మిట్టసోమాపురం గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వరమ్మ, అలాగే అచ్చుకట్ల ఫక్రుద్దీన్, కొండే జయలక్ష్మి, కమ్మరి వెంకటేష్ ఆచారి, వీరితోపాటు వీఐసీ, పీఏసీఎస్ కడిమెట్ల, ఏడీఏ ఎమ్మిగనూరు, పూలచింత సర్పంచ్, జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్, కర్నూలు అధికారులను ప్రభుత్వం నియమించింది.

మహిళలను కించపరిచినవారిపై కేసులు నమోదు చేయాలి


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ మహిళా నాయకులు

మంత్రాలయం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను వేశ్యలు అంటూ కించపరుస్తూ మాట్లాడిన వైసీపీ అనుకూలురు కృష్ణం రాజు, కొమ్మినేని శ్రీనివాసులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు వరదరాజులు, అశోక్ రెడ్డి, మధు, టీడీపీ మహిళా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి, లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఇంటి ఆ డపడుచులను వేశ్యలుగా చూస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై దురుసుగా మాట్లాడితే వైసీపీకి పుట్టగతులు ఉండవని. వైసీపీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎమ్మిగనూరు: అమరావతి మహిళలను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎమ్మిగనూరు మహిళా నాయకులు దేవమ్మ, కౌన్సిలర్లు సరోజమ్మ, స్వాతి, అన్నపూర్ణమ్మ, శంకరమ్మలు డిమాండ్ చేశారు. జగన్ మీడియాలో రాజధానిలోని మహిళలను కిం చపరిచే విధంగా మాట్లాడటాన్ని నిరసిస్తూ ఆదివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో టీడీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు పద్మ, నాగవేణి, ఖాజీబీ, రంగమ్మ, ఉమాదేవి, షాకియా, లక్ష్మీదేవి, కౌన్సిలర్ రామదాసు గౌడ్, జయన్న, నరసప్ప, ఈరన్న, మహేష్, షాలేం, అబ్రహాం, వినయ్, నవాజ్, ఈరన్న, అబ్దుల్ పాల్గొన్నారు.


సోమప్ప సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా నాయకులు

గాజులదిన్నె వద్ద పర్యాటకుల సందడి


గాజులదిన్నె ప్రాజెక్టులో స్నానాలు చేస్తున్న పర్యాటకులు


ప్రాజెక్టు దగ్గర సందడి చేస్తున్న పర్యాటకులు

గోనెగండ్ల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పర్యాటకులతో గాజులదిన్నె ప్రాజెక్టు సందడిగా మారింది. బక్రీద్ పండగను పురస్కరించుకుని ముస్లింలు భారీగా గాజులదిన్నె ప్రాజెక్టుకు విచ్చేశారు. గతంలో పర్యా టక కేంద్రంగా ఉండటంతో ఈ పండుగ సందర్భంగా ఎమ్మి గనూరు, కోడుమూరు, దేవనకొండ, గోనెగండ్ల తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పర్యటకులు తమ సొంతవాహనాల్లో తరలి వచ్చారు. పం డుగ సందర్భంగా చేసుకున్న వంటకాలను తీసుకుచ్చి ప్రాజెక్ట్‌లో బం ధువులు, స్నేహితులతో కలసి భోజనం చేసి ప్రాజెక్టు నీటిలో సరదాగా గడిపి, సాయంత్రం తమస్వంత గ్రామాలకు బయలు దేరారు. ఉదయం నుంచి ప్రాజెక్టు ప్రాంతం సందడిగా మారిపోయింది.

ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం


వెండిరథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం జ్యేష్ఠ మాస ద్వాదశి శభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. ప్రహ్లాదరాయల అలంకరణ చూసి భక్తులు పులకించిపోయారు.

తహసీల్దార్ బదిలీని రద్దు చేయాలి

మంత్రాలయం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిజాయితీగా పని చేస్తున్న మంత్రాలయం తహసీల్దార్ ఎస్.రవి బదిలీని రద్దుచేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, సీపీఎం మండల కార్యదర్శి జయరాజు, అనిల్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ, సీపీఎం వేర్వేరు సమావేశాల్లో వారు మాట్లాడుతూ మంత్రాలయానికి ఎంతో మంది తహసీల్దార్లు పనిచేసి నప్పటికీ తహసీల్దార్ ఎస్.రవి రాజకీయ తొత్తులుగా మారకుండా చిన్న, సన్నకారు రైతులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సరైన న్యాయం చేశారన్నారు. ఏడాది కాక ముందే మరో చోటికి బదిలీ చేయడం సరికాదని, ఆయన బదిలీని విరమించుకోకపోతే మండలంలో పెద్ద ఎత్తు న ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు అంజి, వీరేష్, సురేష్,చిన్న, రాజు, మోహన్, హనుమంతు, గోపి, మహబూబ్‌బాషా ఉన్నారు.

టీడీపీ నాయకులకు పరామర్శ

నందవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవ రం టీడీపీ నాయకుడు నల్లారెడ్డిని ఆదివారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ దేశాయ్‌మాధవరావు పరా మర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకు న్నారు. విషయంపై టీడీపీ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సాయం అందిస్తామన్నారు.

కోసిగి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కోసిగి సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు పెండ్యాల ఆదినారాయణశెట్టి అనా రోగ్యంతో హైదరాబాదులోని సన్‌షైన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుం డటంతో కోసిగి టీడీపీ మండల నాయకులు, మాజీ సాగునీటి సంఘం చైర్మన్ పల్లెపాడు రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, నాడిగేని చిన్నతాయన్న, బసవరాజు ఆదివారం హైదరాబాదులోని సన్‌షైన్ హాస్పిటల్‌లో ఆయన్ను పరామర్శించారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. 15 రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బం దులకు గురయ్యారు. మే నెల మొదటి వారంలోనే పత్తిపంటలను సాగు చేయడంతో కురిసిన ముందస్తు వర్షాలకు మొలకలు వచ్చాయి. ఈ తరుణంలో వరుణ దేవుడు కరుణిస్తుండడంతో రైతుల్లో పత్తి పంటపై ఆశలు పెరిగాయి.

కోసిగిలో భారీ వర్షం

కోసిగి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. భారీ ఉరుములు, మెరుపులతో వర్షం పడటంతో చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళనలకు గురయ్యారు. మృగశిర కార్తి మొదటి రోజే భారీ వర్షం పడటంతో కోసిగి రైతులు, సంతోషం వ్యక్తం చేశారు.

వర్షాలతో రహదారులు అస్తవ్యస్తం


గుంతలమయంగా బైలుప్పల - తెర్నేకల్లు దారి


చిన్నభోంపల్లికి వెళ్లే రోడ్డుపై వర్షం నీరు

గోనెగండ్ల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెల రహదారులు అధ్వానంగా మారి పోయాయి. చిన్న పాటి చినుకులు కురిస్తేచాలు రహదారులు చిత్తడి చిత్తడిగా మారిపోతుండటంతో ఆయా గ్రామాల మధ్య రాక పోకలకు ఇబ్బందిగా ఉంది. బైలుప్పలలో చినుకు పడితే ఆ గ్రామలోని రహ దారులు చిత్తడిగా మారిపోయి ప్రజల రాక పోకలకు ఇబ్బందిగా మారిపోతుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కోసిగి: దొడ్డి గ్రామంలో ప్రాథ మిక పాఠశాల సమీపంలోని చిన్నభోంపల్లి, పెద్ద భోంపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు నీటి కుంటలా తయారైంది. లోతట్టు రోడ్డు ఉండటంతో వర్షం పడిన సమయాల్లో నీరుచేరి సుమారు మోకాల్లోతు పైగా నీటి కుంటలా మారడంతో వాహనదారులు, గ్రామస్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు